సాక్షి
మంచిర్యాల
సోమవారం, 29, జూలై, 2024



ప్రత్యేక అలంకరణలో మైసమ్మ తల్లి





బో'నమో' మైసమ్మ..

రామకృష్ణాపూర్: ఆషాఢ మాసం చివరి ఆదివారం సందర్భంగా మందమర్రి మండలం బొక్కలగుట్టలోని గాంధారి మైసమ్మకు భక్తులు బోనమెత్తారు. మట్టి కుండల్లో బోనం వండిన మహిళలు వాటిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం బోనం ఎత్తుకుని డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. 108 కుండల బోనం నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వేల మంది తరలివచ్చారు. చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, జెడ్పీ మాజీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, బొక్కలగుట్ట మాజీ సర్పంచ్ బొలిశెట్టి సువర్ణ స్థానిక ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు అమ్మవారికి పూజలు చేశారు. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



బోనంతో యువతి



బోనాలు ఎత్తుకుని డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల నడుమ ఆలయానికి వస్తున్న మహిళలు, భక్తులు



అమ్మవారికి మొక్కులు..



బోనమెత్తుకుని వస్తున్న ఎమ్మెల్యే వివేక్, మాజీ ఎమ్మెల్యే ఓదెలు



ఊరేగింపులో నృత్యం చేస్తున్న మహిళలు

న్యూస్‌రీల్

సత్యదేవున్ని దర్శించుకున్న డీసీపీ



పూజలు చేస్తున్న డీసీపీ, కుటుంబ సభ్యులు

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామిని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు వారికి స్వాగతం పలికారు. దర్శనం అనంతరం, అర్చకులు, వేద పండితులు ఆశీర్వదించి శేషవస్త్రంతో సన్మానించారు. స్వామి వారి లడ్డూ ప్రసాదం అందించారు. ఆయన వెంట లక్సెట్టిపేట సీఐ నరేందర్, దండేపల్లి ఎస్సై ఉదయ్‌కిరణ్ ఉన్నారు.

ఏబీపీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా తిరుమల్‌రావు



తిరుమల్‌రావును సత్కరిస్తున్న సభ్యులు

మంచిర్యాలఅర్బన్: అఖిలభారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయ ప్రధాన కార్యదర్శిగా మంచిర్యాలకు చెందిన బేతి తిరుమల్‌రావు ఎన్నికయ్యారు. ఖమ్మంలో ఆదివారం నిర్వహించిన ఏబీఏపీ జాతీయ కార్యవర్గసమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తిరుమల్‌రావు ఎన్నికపై తెలంగాణ అధ్యక్షుడు పుల్లం రాజు, కార్యదర్శి సిద్దులు హర్షం వ్యక్తం చేశారు.

చెస్ టోర్నమెంట్



బహుమతులు, సర్టిఫికెట్లతో క్రీడాకారులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఎక్స్‌లెంట్ చెస్ అకాడమీ, వికాస తరంగిణి చిన్నజీయర్‌స్వామి ఎడ్యుకేషన్ యాజమాన్యం ఆధ్వర్యంలో అండర్-15 చెస్ టోర్నమెంట్‌ను జిల్లా కేంద్రంలోని జీయర్ ట్రస్టు భవనంలో ఆదివారం నిర్వహించారు. 71 మంది పోటీల్లో పాల్గొనగా, గెలుపొందిన విజేతలకు ట్రోఫీలు, ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో ట్రస్టు యాజమాన్యం హన్మంతరావు, వీవీ.కృష్ణారావు, అకాడమీ నిర్వాహకులు పాల్గొన్నారు.

నాయక్‌పోడ్‌ల అభివృద్ధికి కృషి చేయాలి



సీతక్కకు చిత్రపటం అందిస్తున్న నాయకులు

జైపూర్: రాష్ట్రంలో సుమారు 6 లక్షల మంది నాయక్‌పోడ్ తెగ ప్రజలు ఉన్నారని, విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగ, రాజకీయాల్లో వెనుకబడి ఉన్నారని నాయక్‌పోడ్ హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు తెలిపారు. హక్కుల కల్పనతోపాటు అభివృద్ధికి కృషి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్కను హైదరాబాద్‌లో ఆదివారం వినతిపత్రం అందజేశారు. పలు సమస్యలను మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లారు. గిరిజన జనాభా ఉన్న జిల్లాల్లో గిరిజన గురుకులాలు, కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం చేపట్టే కుల గణనలో నాయక్‌పోడ్ తెగను గోండులతో కలుపకుండా ప్రత్యేకంగా లెక్కించాలని కోరారు. ఆదివాసీ నాయక్‌పోడ్ తెగకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని, చట్టసభల్లో అవకాశం కల్పించాలని విన్నవించారు. మంత్రిని కలిసినవారిలో నాయక్‌పోడ్ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంజి రాజన్న, ఉపాధ్యక్షులు గుండం పోచన్న, గంట సత్యం తదితరులు ఉన్నారు.

గాండ్రించని బెబ్బులి!



జీవ వైవిధ్యంలో పులిపాత్ర గొప్పది. దట్టమైన అడవులు ఉన్నచోట పులులు ఉంటాయి. అయితే కవ్వాల్ టైగర్‌జోన్‌లో మాత్రం పులి కనిపించడం లేదు. చుట్టపుచూపుగా వచ్చిపోతోంది. జూలై 29న అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. - వివరాలు 10లో▸

మత్తు వదిలేలా..

- జిల్లాకు నార్కోటిక్ డాగ్, టెస్టింగ్ కిట్లు
- డ్రంకెన్‌డ్రైవ్ తరహాలో డ్రగ్‌అండ్ డ్రైవ్
- డీఅడిక్షన్ సెంటర్‌లో పరీక్షలు
- కౌన్సెలింగ్‌తో మార్పు తెచ్చేయత్నం
- స్కూళ్లు, కాలేజీలపై నజర్



ఈ నెల20న రైల్వే స్టేషన్‌లో నార్కోటిక్ డాగ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: మాదక ద్రవ్యాల రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపాలని సీఎం రేవంత్‌రెడ్డి పోలీసులను ఆదేశించారు. ఈమేరకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లాలని సూచించారు. దీంతో యువతను చిత్తు చేస్తున్న మత్తుపై పోలీసులు యుద్ధం ప్రకటించారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణలో యాంటి నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(టీన్యాబ్) పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేసి డ్రగ్స్ సంబంధించిన కేసులన్నీ వీటిలోనే విచారణ చేసేలా కసరత్తు చేస్తున్నారు. హైదరాబాద్, రాచకొండ, వరంగల్ కేంద్రాలుగా పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని జిల్లాలోని పోలీస్ స్టేషన్లకు గంజాయి టెస్టింగ్ కిట్లు సరఫరా చేశారు. గంజాయి వాసనను పసిగట్టేందుకు నార్కోటిక్ డాగ్స్‌ను సిద్ధం చేశారు. రవాణా నియంత్రణకు డాగ్స్‌తో తనిఖీలు చేపడుతున్నారు.

కిలోమీటర్ దూరం నుంచే పసిగట్టేలా..

గంజాయి స్మగ్లర్లు యువతే లక్ష్యంగా తమ వ్యాపారం విస్తరిస్తున్నారు. గంజాయి రవాణా, విక్రయాలు అడ్డుకునేందుకు పోలీస్ జాగిలాలను సిద్ధం చేశారు. ఈమేరకు నార్కోటిక్ డాగ్స్‌కు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఇవి కిలోమీటర్ దూరం నుంచే గంజాయి వాసన పసిగడతాయి. నార్కోటిక్ డాగ్స్‌తో ఇప్పటికే బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో ఇటీవల తనిఖీలు నిర్వహిస్తారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు అక్రమంగా నిల్వఉంటే.. పసిగట్టి గుట్టు రట్టు చేస్తాయి. జిల్లాలో ఇప్పటికే గంజాయి తాగుతూ, అమ్మిన వారు 300 మందిపై కేసులు నమోదయ్యాయి. వీరికి డీసీపీ భాస్కర్ ఈనెల 19న కౌన్సెలింగ్ నిర్వహించారు. వీరితోపాటు మరో 300 మంది తప్పించుకుతిరుగుతున్నట్లు గుర్తించారు. వీరిపై ప్రత్యేక దృష్టిసారించారు.

ఐదేళ్లలో జిల్లాలో నమోదైన గంజాయి కేసులు...

సంవత్సరం	కేసులు	అరెస్టైనవారు	పట్టుకున్న గంజాయి(కిలోల్లో)
2020	05	11	6.69
2021	17	50	12.72
2022	07	18	7.82
2023	49	73	483.338
2024 జూలై	25	42	50.25

గంజాయి టెస్టింగ్ కిట్లు...

పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడిపేవారిని పట్టుకునేందుకు డ్రంకెన్‌డ్రైవ్‌ను నిర్వహిస్తున్నారు. గంజాయి మత్తు కారణంగా కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. హిట్ అండ్ రన్ కేసులు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇలాంటి వారిని గుర్తించేందుకు డ్రగ్‌అండ్‌డ్రైవ్‌లు నిర్వహించనున్నారు. ఇందుకు అవసరమైన కిట్లు జిల్లా పోలీస్ స్టేషన్లకు చేరుకున్నాయి. టెస్ట్ తర్వాత గంజాయి తాగినట్లు నిర్ధారణ అయితే వారిని జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డీఅడిక్షన్ సెంటర్‌కు తరలించి పరీక్షలు చేయిస్తారు. అక్కడే వారికి నిత్యం ఉదయం, సాయంత్రం మానసిన వైద్య నిపుణులతో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అయినా మారనివారిని హైదరాబాద్‌కు పంపించి చికిత్స అందిస్తారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీసీపీ భాస్కర్(ఫైల్)

యువతరాన్ని కాపాడేందుకే...

గంజాయి సేవించే వారిలో అధిక శాతం 18 నుంచి 30 ఏళ్ల వయసు వారే ఉన్నారు. ఈ నేపథ్యంలో యువతను గంజాయి, ఇతర డ్రగ్స్ వ్యసనాల నుంచి విముక్తి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించింది. గతంలో గంజాయి కేవలం పట్టణాలకే పరిమితమయ్యేది. ప్రస్తుతం పల్లెలకూ విస్తరించింది. గ్రామీణ ప్రాంత యువకులు పట్టణాలకు ఉన్నత చదువుల కోసం వెళ్లి డ్రగ్స్‌కు అలవాటుపడుతున్నారు. చదువు పూర్తయి ఇంటికి వచ్చాక ఆ వ్యసనాన్ని కొనసాగిస్తున్నారు. ఇతరులకూ అలవాటు చేస్తున్నారు. డబ్బుల కోసం విక్రయాలు ప్రారంభిస్తున్నారు. దీంతో పల్లెల్లోనూ యువత మత్తుకు బానిసవుతోంది. ఈ నేపథ్యంలోనే పోలీస్ శాఖ డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతోంది. జిల్లాలో నార్కోటిక్ టీమ్ ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. స్కూళ్లు, కాలేజీల్లో, గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతను వ్యసనం నుంచి విముక్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

యువతను కాపాడేందుకే..



యువతను గంజాయి, డ్రగ్స్‌కు బానిస కాకుండా కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నాం. యువత మత్తుకు బానిసై జీవితాలను అంధకారం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణపై ప్రత్యేక దృష్టి సారించాం. జిల్లాలో నార్కోటిక్ టీమ్ ప్రత్యేకంగా పనిచేస్తోంది. గంజాయి వినియోగించిన, విక్రయించిన వారు తమ పద్ధతులు మార్చుకునేలా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. తీరు మార్చుకోని వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తాం. ఇప్పటికే 300 మందిపై సస్పెక్ట్ షీట్ నమోదు చేశాం. ఎవరైనా గంజాయికి అలవాటుపడినట్లు అనుమానం వస్తే 100 డయల్ చేసి సమాచారం ఇవ్వాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

– భాస్కర్, డీసీపీ, మంచిర్యాల

ఆర్కే 5 గనికి జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న కంపెనీ అధికారులు

శ్రీరాంపూర్: రక్షణలో సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలోని ఆర్కే-5 గనికి జాతీయ అవార్డు లభించింది. మైన్స్‌సేఫ్టీ అవార్డు-2024 కోల్ అండర్ గ్రౌండ్ స్మాల్ కేటగిరీలో ఈ అవార్డు దక్కింది. కోల్‌కత్తాలో ఈ అవార్డును ఆదివారం ప్రదానం చేశారు. మైన్స్‌సేఫ్టీ సంస్థ నుంచి మైనింగ్ డీజీఎంఎస్ ప్రభాత్‌కుమార్ అవార్డును ప్రదానం చేయగా సింగరేణి డైరెక్టర్(పీపీ) జి.వెంకటేశ్వర్‌రెడ్డి, గని మేనేజర్ అబ్దుల్ ఖాదిర్ అందుకున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- డిప్యూటీ ఆర్ఎం(ఎం) ప్రవీణ్



కార్మికులను సన్మానిస్తున్న డీఆర్ఎం ప్రవీణ్

మంచిర్యాలఅర్బన్: డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని డిప్యూటీ ఆర్ఎం(మెయింటెన్స్) ప్రవీణ్ అన్నారు. ప్రమాద రహిత వారోత్సవాల్లో భాగంగా మంచిర్యాల డిపోలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని సూచించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మెకానిక్‌లను సన్మానించారు. కార్యక్రమంలో డీఎం జనార్దన్, ఎంఎఫ్ సధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'కాళేశ్వరం తప్పులు క్షమించమని పూజలు'

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ పర్యటనపై చెన్నూరు ఎమ్మెల్యే వివేక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

మంచిర్యాలటౌన్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కాళేశ్వరం ప్రాజెక్టు పర్యటనపై చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి సెటైర్లు వేశారు. కాళేశ్వరంలో చేసిన తప్పులను క్షమించమని బీఆర్ఎస్ నాయకులు ప్రాజెక్టులను సందర్శించి కాళేశ్వరం ముక్తీశ్వరాలయంలో పూజలు చేశారని ఎద్దేవా చేశారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆదివారం మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టును కమీషన్ల కోసమే కట్టారన్నారు. కేటీఆర్‌కు రైతుల మీద ప్రేమ ఉంటే కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో నష్టపోయిన రైతులను ఎందుకు ఆదుకోలేదని ప్రశ్నించారు. రైతులకు క్షమాపణ చెప్పాలన్నారు. గతంలోనూ కాళేశ్వరం నుంచి నీటిని ఎత్తిపోసినందుకు రూ.2 వేల కోట్ల కరెంటు బిల్లు వచ్చిందని గుర్తు చేశారు. బీజేపీ నాయకులు కేంద్రంతో మాట్లాడి రాష్ట్రానికి నిధులు తీసుకురావాలన్నారు. పోడు భూములు, అభివృద్ధి పనులకు ఫారెస్టు అనుమతులు తీసుకురావాలని సూచించారు. బీఆర్ఎస్, బీజేపీ మధ్య అండర్‌స్టాండింగ్ ఉందని, కాళేశ్వరం కాంట్రాక్టర్ ప్రపంచంలోనే ధనవంతుడు కాగా, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు రూ.500 కోట్ల విరాళాలు వచ్చాయని ఆరోపించారు. కాళేశ్వరం బ్యాక్‌వాటర్‌తో చెన్నూర్ నియోజకవర్గంలో పంటలు దెబ్బతినకుండా, ఇళ్లలోకి నీరు రాకుండా కరకట్ట నిర్మిస్తామని తెలిపారు.

కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



నూతన సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: ఎన్‌హెచ్ఎం కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని జాతీయ ఆరోగ్యమిషన్ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేశ్‌ఖన్నా, సీపీఐ పట్టణ అధ్యక్షుడు ఖలీందర్‌ఖాన్ అన్నారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు 17 వేల మంది ఉనానరని తెలిపారు. వివిధ క్యాటగిరీలలో తక్కువ వేతనంతో పని చేస్తున్నారని పేర్కొన్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నా పనికి తగిన వేతనం ఇవ్వడం లేదన్నారు. రెగ్యులర్ చేసి వేతనాలు పెంచాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ యూనియన్లకు చెందిన 150 మంది ఉద్యోగులు సీపీఐ అనుబంధ సంఘం ఏఐటీయూసీలో చేరారు. అనంతరం ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల యూనియన్(ఏఐటీయూసీ)జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా మేకల దాసు, అధ్యక్షుడిగా జి.రాజు, ప్రధాన కార్యదర్శిగా దేవనబోయిన బాపుయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గడ్డం మధు, వైస్ ప్రెసిడెంట్‌గా రాజ్‌కుమార్, ధనలక్ష్మి, జాయింట్ సెక్రెటరీలుగా జాడి కళావతి, అప్సర, ఎగ్జిక్యూటివ్ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు పాల్గొన్నారు.

మిడ్ మానేర్‌కు 'ఎల్లంపల్లి' నీళ్లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట వద్ద గల ఎల్లంపల్లి(శ్రీపాదసాగర్) ప్రాజెక్టులో నీటిమట్టం పెరుగుతోంది. ఎగువ నుంచి వస్తున్న వరదతో 17 టీఎంసీలకు పైగా నీటితో నిండుకుండను తలపిస్తోంది. పది రోజుల్లోనే జలాశయానికి దాదాపు 13 టీఎంసీల నీరు చేరింది. ఆదివారం నాటికి ప్రాజెక్టు నీటి మట్టం 148 మీటర్ల క్రస్ట్ లెవెల్‌కు 147.20 మీటర్లకు చేరింది. 20.175 టీఎంసీలకు 17.875 టీఎంసీల నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 14 వేల కూసెక్కులు, కడెం ప్రాజెక్టు నుంచి 7 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ప్రాజెక్టులోకి వస్తోంది. దీంతో నంది పంప్‌హౌస్ మోటార్ల ద్వారా 13 వేల క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. మేడారం జలాశయానికి తరలించి గాయత్రి పంప్ హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోస్తూ మిడ్‌మానేరు జలాశయానికి తరలిస్తున్నారు.

ఆర్ఎస్ఆర్ ఎక్సెస్‌తో సమస్యలు?

- జిల్లాలో భూసమస్యలు పెండింగ్
- పరిష్కారం కోసం రైతుల పాట్లు..

దండేపల్లి: ధరణి పోర్టల్‌లో మార్పులు చేసి భూసమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు కొన్ని చర్యలు చేపట్టింది. కానీ, చాలా సమస్యలు పెండింగ్‌లోనే ఉంటున్నాయి. సమస్యల పరిష్కారంలో కొన్నింటికి ఆర్ఎస్ఆర్ఎక్సెస్ (రీసర్వే సెటిల్‌మెంట్ రికార్డు)ప్రధాన అడ్డంకిగా మారింది. దీంతో చాలా దరఖాస్తులను అధికారులు తిరస్కరిస్తున్నారు. మిస్సింగ్ సర్వే నంబర్, సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్, డీఎస్ పెండింగ్ తదితర సమస్యల పరిష్కారం కోసం ధరణి పోర్టల్‌లో దరఖాస్తులు చేసుకుంటే, సమస్యల పరిష్కారానికి ఆర్ఎస్ఆర్ అడ్డుగా నిలుస్తోంది. దీంతో చాలా భూసమస్యలు పెండింగ్‌లోనే ఉన్నాయి. పరిష్కారం కోసం చాలా మంది చాలా సార్లు డబ్బులు చెల్లించి, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవడంతోపాటు, తహసీల్దార్ కార్యాలయం మొదలుకొని ఆర్డీవో, కలెక్టరేట్, సీసీఎల్ వరకు తిరుగుతూ, డబ్బులు, సమాయాన్ని వృథా చేసుకుంటున్నారు.

కాస్రాకు, ధరణికి వ్యత్యాసం..

1954 భూసర్వే ప్రకారం కాస్రా పహణీలు(భూరికార్డులు)రూపొందించారు. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక, భూ రికార్డుల ప్రక్షాళన అనంతరం, కొత్త రికార్డులు తయారు చేశారు. ధరణి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి, భూరికార్డులన్నీ అందులోనే పొందుపరిచారు. భూముల రిజిస్ట్రేషన్, సక్సేషన్, మ్యూటేషన్ తదితరాలన్నింటికీ ధరణి పోర్టల్‌ను వినియోగిస్తున్నారు. వాటన్నింటికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను పరిశీలించి, కాస్రా పహణీ, ధరణి పహణీల ప్రకారం భూమి సమానంగా ఉంటేనే అధికారులు ఓకే చేస్తున్నారు. కాస్రా పహణీలకు, ధరణి పోర్టల్ రికార్డుల్లో భూముల విస్తీర్ణంలో హెచ్చుతగ్గులో వ్యత్యాసం ఉంటే మాత్రం తిరస్కరణ, లేదంటే పెండింగ్‌లో పెడుతున్నారు. దీంతో సమస్యలు పరిష్కారంకాక చాలామంది ఇబ్బంది పడుతున్నారు.

ఎవరికీ అధికారం లేదు..

ధరణి చట్టప్రకారం ఎక్సెస్‌ను తొలగించే అధికారం ఎవరికి లేదు. పైగా క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించేందుకు రెవెన్యూలో సిబ్బంది కొరత కూడా ఉంది. కాస్రా రికార్డులు, ధరణి రికార్డులు సరిపోలేలా సవరించి, భూసమస్యలు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. ఆర్ఎస్ఆర్ ఎక్సెస్‌తో జిల్లా వ్యాప్తంగా వేలాది భూ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయమై దండేపల్లి తహశీల్దార్ సంధ్యారాణిని సంప్రదించగా, ధరణి చట్టప్రకారం ఎక్సెస్‌ను తొలగించరాదని తెలిపారు. ఎక్సెస్ ఉంటే మాత్రం దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయని పేర్కొన్నారు.

క్లుప్తంగా

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

• ఇద్దరికి స్వల్పగాయాలు

జైపూర్: మండలంలోని నర్వ బస్టాండ్ సమీపంలో గల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు టౌన్‌షిప్ మూ డోగేటు వద్ద ఆదివారం ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థాని కులు తెలిపిన వివరాల ప్రకారం విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణ బాధ్యతలు చేపడుతున్న పవర్‌మేక్ కంపెనీలో పర్యావరణ పరిరక్షణ విభాగంలో ఇన్‌చార్జి గా విధులు నిర్వహిస్తున్న బి.రాజేశ్ ఆదివారం అత ని అల్లుడు ఆకాశ్‌తో కలిసి బైక్‌పై వెళ్తుండ గా చె న్నూర్ నుంచి మంచిర్యాల వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. బైక్‌పై నుంచి రాజేశ్, ఆకాశ్ ఒక్కసారిగా దూకడంతో బైక్ బస్సుకిందకు దూసుకుపోయింది. దీంతో పెద్దప్రమాదం తప్పింది. స్వల్పంగా గాయపడ్డవారిని అం బులెన్స్‌లో మంచిర్యాల ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాగులు దాటి.. వైద్య సేవలందించి..



వాగు దాటుతున్న వైద్యబృందం

తిర్యాణి: వర్షాకాలంలో మారుమూల ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలుతాయి. ఈ నేపథ్యంలో శనివారం మండలంలోని రోంపెల్లి నుంచి ఏఎన్‌ఎం భారతి ఆధ్వర్యంలో వైద్యబృందం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండాల గ్రామానికి కాలినడకన మూడు వాగులు దాటివెళ్లి అక్కడి ప్రజలకు వైద్యసేవలు అందించారు. వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు.

అదృశ్యమైన మహిళ మృతదేహం లభ్యం



పద్మ (ఫైల్)

మంచిర్యాలక్రైం: అదృశ్యమైన మహిళ మృతదేహం ఆదివారం స్థానిక గోదావరిలో లభ్యమైనట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. పాత మంచి ర్యాలకు చెందిన ధరణి పద్మ (45) కొంతకా లంగా అనారోగ్యంతో బాధపడుతోంది. మతి స్థిమితం కూడా లేకపోవడంతో ఈ నెల 25న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ నెల 27న రాళ్లవాగులో మహిళ మృతదేహం కొట్టుకుపోయిందని స్థానికులు అందించిన సమాచారం మేరకు ఆదివారం ఉదయం 20 మంది జాలరులతో కలిసి స్పెషల్ పార్టీ పోలీసులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గాలించగా సీతారాంపల్లి పంప్‌హౌస్ సమీపంలో మృతదేహం లభించింది. 9 గంటలు శ్రమించిన జాలర్లు, పోలీసులు ఎట్టకేలకు మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలికి భర్త రవి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

గాండ్రించని బెబ్బులి!



• కవ్వాల్ రిజర్వు ఫారెస్ట్‌లో ఆగని పులి
• రెండేళ్లుగా కానరాని టైగర్ జాడ
• నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం

జన్నారం: జీవ వైవిధ్యంలో పులి పాత్ర గొప్పది. దట్టమైన అడవులు ఉన్నచోట పులులు ఉంటాయి. పులుల సంతతిని పెంచడంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో రెండో టైగర్ జోన్‌గా కవ్వాల్ టైగర్‌జోన్‌ను ఏర్పాటు చేశారు. దట్టమైన అడవులు, సరిపడా వన్యప్రాణులు, పది పులులు స్వేచ్ఛగా ఉండేందుకు వీలుగా అడవులు.. ఇన్ని సౌకర్యాలున్నా పులి రాకపోకలతో సరిపెడుతోంది. కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని కాగజ్‌నగర్ ప్రాంతంలో ఆరు పులులకు గాను రెండు మృత్యువాత పడ్డాయి. ఒకటి వేరే ప్రాంతానికి తరలివెళ్లగా కేవలం మూడు పులులు ఉన్నట్లు చెబుతున్నారు. నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

కవ్వాల్ అభయారణ్యం దట్టమైన అడవులు, వివిధ రకాల వన్యప్రాణులకు నెలవు. చెంగుచెంగున ఎగిరే వన్యప్రాణులు, జలజల సవ్వడి చేసే జలపాతాలు.. కిలకిల రావాలు పలికే పక్షులు.. వీటన్నింటి కలబోత. కేంద్ర ప్రభుత్వం 2012 ఏప్రిల్ 10న కవ్వాల్ అభయారణ్యాన్ని పులుల రక్షిత ప్రదేశంగా ఏర్పాటు చేసింది. ఈ అభయారణ్యంలో 893 చదరపు కిలోమీటర్లు కోర్ ఏరియాగా, 1,123 చదరపు కిలోమీటర్లు బఫర్ ఏరియాగా ప్రకటించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు జిల్లాల నుంచి ఆరు డివిజన్లుగా విభజించి చేసి కవ్వాల్ సర్కిల్ ఏర్పాటు చేసింది. ఈ అడవుల్లో పులికి ఇష్టమైన దుప్పులు, కొండగొర్రెలు, మేకాలు, నీలుగాయిలు, సాంబర్లు, చుక్కల దుప్పులు, అడవి పందులులాంటి శాఖహార జంతువులు, చిరుతలు, ఎలుగుబంట్లు, అడవికుక్కలు, నక్కలు, తోడేళ్ల వంటి మాంసాహార జంతువులు ఆవాసం ఉంటున్నాయి. శాఖాహార జంతువుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నా ఇక్కడ పులి రాక ప్రశ్నార్థకంగా మారింది.

రెండేళ్లుగా కానరాని పులి

కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం, ఖానాపూర్, ఉట్నూర్, ఆసిఫాబాద్ డివిజన్‌లలో పులి పలుమార్లు రాకపోకలు సాగించింది. కవ్వాల్ టైగర్ జోన్ పరిసర పరిధిలో తిప్పేశ్వర్, తాడోబా, ఇంద్రావతి టైగర్‌జోన్‌లు ఉన్నాయి. ఆయా టైగర్‌జోన్‌ల గుండా పులులు కవ్వాల్ టైగర్‌జోన్‌లోకి రాకపోకలు సాగించాయి. 2016 నుంచి 2022 వరకు దొంగపల్లి, అలీనగర్, ఖానాపూర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కెమెరాకు పులి చిక్కింది. అలీనగర్, దొంగపల్లి ప్రాంతాల్లో పలు పశువులను కూడా వేటాడింది. కానీ ఎందుకో ఇక్కడ ఆవాసం ఏర్పాటు చేసుకోవడం లేదు. 2022లో ఖానాపూర్ డివిజన్‌లో పర్యటించిన పులి ఆతర్వాత కెమెరాలకు చిక్కడం లేదని అధికారులు పేర్కొంటున్నారు.

పులి ఆవాసం కోసం అభివృద్ధి

కవ్వాల్ టైగర్‌జోన్‌లో అత్యధికంగా అడవి, ఆవాస యోగ్యం, వన్యప్రాణులున్న ప్రాంతం జన్నారం అటవీ డివిజన్. టైగర్‌జోన్‌లో 22 శాతం మాత్రమే జన్నారం డివిజన్‌లో ఉంది. పులి ఆవాసం కోసం అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించారు. ఐదేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాంపా స్కీం కింద సుమారు రూ.6.30 కోట్లు, సెంట్రల్ ఫండ్ ద్వారా రూ. 2 కోట్లకు పైగా నిధులు వెచ్చించినట్లు తెలిసింది. ఈ నిధులతో అడవుల్లో కుంటల నిర్మాణం, గడ్డి క్షేత్రాలు, సాసర్ వెల్స్, బేస్‌క్యాంపులు, ఎనిమల్ ట్రాకర్స్ నిర్వహణ, తదితర అభివృద్ధి పనులతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తూ నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. నాలుగేళ్లలో 900 హెక్టర్లలో గడ్డి క్షేత్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది కూడా 250 హెక్టర్లలో గడ్డిక్షేత్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తత్ఫలితంగా జన్నారం అటవీ డివిజన్‌లో రెండేళ్లలో పులికి ఆహారమైన వన్యప్రాణుల సంఖ్య రెట్టింపైంది.

కారణాలెన్నో...

పులి చాలా బరువైన జంతువు. తేలిగ్గా వేటాడేందుకు ఇష్టపడుతుంది. అందుకే గడ్డి మాటున వన్యప్రాణులను చూసి వాటిపై దూకి వేటాడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. జన్నారం డివిజన్‌లో దట్టమైన టేకు వనం ఉంది. గుబురైన పొదలు, పలు రకాల చెట్లు ఉండటం వల్ల పులి వేటకు అడ్డు పడే అవకాశం ఒక కారణమని చెప్పవచ్చు. అదే విధంగా పులికి అలజడి లేకుండా ఉంటేనే ఇక్కడ ఉండే అవకాశం ఉంది. జన్నారం పరిసర ప్రాంతాల్లోని పశువులు మేత కోసం అడవిలోకి వెళ్తాయి. ఆ శబ్దానికి అలజడి పెరిగి పులి వేరే ప్రాంతానికి తరలివెళ్లే అవకాశం ఉందని అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

విరివిగా గడ్డి క్షేత్రాలు



పులులు ఆవాసంగా ఉండాలంటే వన్యప్రాణుల సంఖ్య పెరగాలి. అందుకే ఇక్కడ కొన్నేళ్లుగా గడ్డి పెంపకం చేపడుతున్నాం. అడవిలో ఎలాంటి అలజడి లేకుండా ఇప్పటికే రెండు గ్రామాలకు పునరావాసం కల్పించాం. ఆ ప్రాంతాల్లో గడ్డి క్షేత్రాలను విరివిగా పెంచుతాం. పులుల సంఖ్య పెంచడంలో అందరి సహకారం కావాలి. అందుకే పులితో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలకు ఉపాధి చూపిస్తూ అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తాం.

– శివ్ ఆశిష్ సింగ్, డీఎఫ్‌వో, మంచిర్యాల

కుమురంభీం జిల్లాలో పులి అలికిడి

• రక్షణకు కన్జర్వేటివ్ రిజర్వ్‌గా ఆసిఫాబాద్ అడవులు

చింతలమానెపల్లి: 2010లో రష్యాలోని సెయింట్ పీటర్‌బర్గ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ పులుల సంరక్షణ సమావేశంలో జూలై 29వ తేదీని అంతర్జాతీయ పులుల దినోత్సవంగా ప్రకటించారు. పులి ఆవాసాలను సంరక్షించేందుకు చర్యలు చేపట్టడం, పులి సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడం, పులుల మనుగడను కాపాడి వాటి సంఖ్య పెంచేందుకు కృషి చేయడం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశం. ఆయా సంస్థలు, ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలతో దేశవ్యాప్తంగా పులుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. 2006లో దేశంలో 1,411 పులులు ఉండగా 2010లో 1706, 2014లో 2,226, 2019లో 2,967, 2023లో 3,167 పులులు ఉన్నట్లు గుర్తించారు.

కుమురంభీం జిల్లాలో మనుగడ

కుమురం భీం జిల్లాలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ అటవీ డివిజన్లు ఉన్నాయి. కాగజ్‌నగర్ డివిజన్‌లో 917 చదరపు కిలోమీటర్లు, ఆసిఫాబాద్ డివిజన్‌లో 1518 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అటవీ ప్రాంతం ఉంది. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో 5 అటవీ రేంజ్‌లు, ఆసిఫాబాద్ డివిజన్‌లో 5 అటవీ రేంజ్‌లు ఉన్నాయి. కాగజ్‌నగర్ డివిజన్‌లోని ఏడు మండలాల పరిధిలో 115, ఆసిఫాబాద్ డివిజన్‌లో 55 చదరపు కిలోమీటర్లు దట్టమైన అటవీ ప్రాంతం ఉంది. జిల్లాకు సరిహద్దుగా మహారాష్ట్ర ఉండగా మూడువైపులా అభయారణ్యాలు ఉన్నాయి. తాడోబా పులుల అభయారణ్యం, భామ్రాగఢ్, తిప్పేశ్వర్ అభయారణ్యాలు ఉండగా మరో వైపు తెలంగాణ అటవీ పరిధిలోని కవ్వాల్ పులుల అభయారణ్యం ఉంది. జిల్లా వ్యాప్తంగా ఆయా అటవీ రేంజ్‌ల పరిధిలో సుమారుగా 8 పెద్ద పులులు సంచరిస్తున్నాయని, మరో మూడు పులులు రాకపోకలు సాగిస్తున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

శ్రీనివాస్‌నాయక్‌కు స్వర్ణనంది పురస్కారం



సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్సీ, ప్రముఖులు

జన్నారం: మండలంలోని హాస్టల్ తండాకు చెందిన బంజారా యువసేన సేవా సంఘ్ జిల్లా అధ్యక్షుడు బాదవత్ శ్రీనివాస్‌నాయక్‌కు స్వర్ణనంది సేవారత్న పురస్కారం లభించింది. ఆదివారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో మెగా ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో అవార్డు అందజేసి సత్కరించారు. కరోనా సమయంలో నిరుపేద గిరిజనులకు సరుకులు అందజేయడం, వ్యాధుల బారిన పడిన పశువులకు ఉచితంగా చికిత్స అందించడం లాంటి సేవా కార్యక్రమాలు చేసినందుకు ఈ అవార్డుకు ఎంపికయ్యాడు. మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్, టీవీ ప్రముఖులు సురేశ్, ఫిట్నెస్ అను, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

ప్రమాదవశాత్తు కాలువలో పడి ఒకరు మృతి

భీమారం: ప్రమాదవశాత్తు కాలువలోపడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాములు తెలిపిన వివరాల ప్రకారం దాంపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి మధుకర్ (60), రవి, సమ్మయ్య ముగ్గురూ కలిసి చేపలు పట్టేందుకు కాలువ వద్దకు వెళ్లారు. చేపలు దొరకకపోవడంతో రవి, సమ్మయ్య ఇంటికి వెళ్లిపోయారు. మధుకర్ మాత్రం సాయంత్రం వరకు ఉండి చేపలతో ఇంటికి వస్తానని వారికి చెప్పాడు. ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య లక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు.

అడవిపంది దాడిలో రైతుకు గాయాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం రాపల్లి గ్రామ శివారులో వ్యవసా య పనులకు వెళ్లిన ఓ రైతుపై అడవిపంది దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. స్థానిక రైతుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. రాపల్లి గ్రామానికి చెందిన సింగం చిన్నయ్య ఆదివారం మధ్యాహ్నం పాతరాపల్లి గ్రామ శి వారులోకి వ్యవసాయ పనులకు వెళ్లాడు. పనుల్లో నిమగ్నమై ఉండగా ఒక్కసారిగా అడవిపంది దాడికి పాల్పడింది. సమీప పొలాల్లో పని చే స్తున్న తోటి రైతులంతా అరవడంతో అడవిపంది పారిపోయింది. గాయాలపాలైన చిన్నయ్యను వెంటనే మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

బురద మేట.. కన్నీటి ఊట



వరదతో కుళ్లిపోయిన పత్తి మొక్కలు

• అయోమయంలో రైతులు

వేమనపల్లి: ఆరు రోజులు ఉప్పొంగి ప్రవహించిన ప్రాణహిత నది ఆదివారం శాంతించింది. ఎన్నో ఆశలతో సాగు చేసిన వందల ఎకరాల పత్తి పంట మొత్తం వరదలా పాలైంది. సారవంతమైన భూముల్లో ఇసుక మేటలు వేసి నేల కోతకుగురై అపారనష్టం వాటిల్లింది. ఆరు రోజులు మొక్కలు నీటిలోనే ఉండడంతో మురిగిపోయాయి. ఇక చేలల్లో పెద్ద ఎత్తున మురత మేటలు వేసింది. కొమురంభీం జిల్లా కౌటాల, బెజ్జూర్, దహెగాంతోపాటు ప్రాణహిత తీర ప్రాంతాలైన వేమనపల్లి, కోటపల్లి మండలాల్లో పత్తి రైతులకు తీవ్ర నష్టం కలిగింది. ప్రాణహిత బ్యాక్‌వాటర్‌తో మంచిర్యాల జిల్లాలో 4,636 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమిక గుర్తించారు. కోటపల్లి మండలంలో 18 గ్రామాల్లో 864 ఎకరాలు, వేమనపల్లి మండలంలో 18 గ్రామాల్లోని 2,155 ఎకరాల్లో పత్తి పంటకు నష్టం జరిగినట్లు గుర్తించారు. ఇది మొదటి దశలో చేసిన ప్రాథమిక నివేదిక కాగా, ఆరు రోజుల్లో రెండుసార్లు ప్రాణహిత ఉప్పొంగి నష్టం అంచనాలు పెరిగినట్లు రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి క్షేత్రస్థాయికి అధికారులను పంపించి పంట నష్టం అంచనా సిద్ధం చేయాలని రైతులు కోరుతున్నారు. పరిహారం చెల్లించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ముందున్నది ముంపు..

తాత్కాలికంగా ప్రాణహితకు వరద ప్రవాహం తగ్గినా సెప్టెంబర్ చివరి వరకు ప్రాణహితకు వరద వస్తుంది. ప్రస్తుతం పత్తిపంట తుడిచిపెట్టుకుపోయింది. వేరే పంట వేద్దామన్నా వరద ముప్పు పొంచి ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.20 వేల వరకు నష్టపోయామని, మళ్లీ పంటలు వేస్తే మళ్లీ నష్టపోవాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. అక్టోబర్‌లో పంటలు వేస్తేనే నష్టపోకుండా ఉంటామని చెబుతున్నారు.

పరిహారం ఇప్పించాలి..



వేమనపల్లి శివారులో పది ఎకరాల్లో పత్తి పెట్టిన. ప్రాణహిత వరదతో మొత్తం కొట్టుకుపోయింది. ఒక్క పత్తి మొలక కూడా మిగలలేదు. చేను దగ్గరికి పోతే దుఃఖమస్తుంది. అధికారులు పరిహారం ఇప్పించాలి.

– గుండె రామన్న, వేమనపల్లి

సర్వే చేయాలి



వేమనపల్లి శివారులో ఐదు ఎకరాల్లో పత్తి సాగుచేసిన. ఆరు రోజులు చేనులో వరద నిలిచింది. దీంతో మొక్కలన్నీ మురిగిపోయినయ్. అధికారులు చేలను పరిశీలించి సర్వే చేయాలి. పరిహారం ఇప్పించి ఆదుకోవాలి.

– చిన్నక్క, వేమనపల్లి

కొత్త గనులు వస్తేనే సింగరేణికి భవిష్యత్

• ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

శ్రీరాంపూర్: సింగరేణిలో కొత్త గనులు వస్తేనే సంస్థకు భవిష్యత్ ఉంటుందని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఆదివారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కేంద్రం వేలంలో ఉంచిన శ్రావణ్ పల్లి గనిని ఏ ప్రైవేటు సంస్థ తీసుకోవడానికి ముందుకు రాలేదన్నారు. ఈ గనిని సింగరేణికే అలాట్ చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. దీనితో పాటు గతంలో అరబిందో కంపెనీకి ఇచ్చిన కోయగూడెం ఓసీపీ, అవంతిక కంపెనీకి ఇచ్చిన సత్తుపల్లి ఓసీపీలను కూడా సింగరేణికే కట్టబెట్టాలన్నారు. తా డిచెర్ల-2 బ్లాక్‌ను కూడా సింగరేణికే కేటాయించాలన్నారు. దీనితో పాటు మూతపడిన వీకే 7 గనిని ఓసీపీగా, జేకే ఓసీపీ ఎక్స్‌టెన్షన్, ఆర్కేపీ ఓసీపీ డిప్ సైడ్ నిల్వలు తీసుకోవడానికి అవసరమైన అనుమతులను కేంద్రం ఇవ్వాలన్నారు. గోలేటీ ఓసీపీ, మా దారం ఓసీపీలకు కూడా కేంద్రం త్వరితగతిన అనుమతి ఇవ్వాలన్నారు. ఈగనులు తెరిస్తేనే సింగరేణికి భవిష్యత్ ఉంటుందని, లేదంటే ముమ్ముందు మ్యాన్‌పవర్ సర్‌ప్లస్ అయ్యే అవకాశం ఉందన్నారు. గత సీఎండీ, ఇతర అధికారులు, నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ ముందు చూపు లేకపోవడం వల్లే నేడు సింగరేణికి ఈ గడ్డు పరిస్థితులు వచ్చాయన్నా రు. కేంద్రం వేలం ప్రక్రియకు పూనుకోకముందే ఈ గనులకు కావాల్సిన అనుమతులు తీసుకోవడంలో జాప్యం చేశారని ఆరోపించారు. ఆర్కే7 గనికి అటవీ అనుమతులు త్వరగా ఇప్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ గనిలోకి వారిని ఇదే ఏరియా గనుల్లో సర్దుబాటు చేయాలన్నారు. సమావేశంలో ఆయా యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచి సెక్రటరీ ఎస్కే బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, సహాయ కార్యదర్శి కొమురయ్య, నాయకులు రాంచందర్, అఫ్రోజ్‌ఖాన్, దాడి రాజయ్య, లక్ష్మణ్, కే.సదానందం, బేర రవీందర్, సమ్మయ్య పాల్గొన్నారు.

వైరల్ ఫీవర్లు షురూ..

• రోజురోజుకూ పెరుగుతున్న జ్వర బాధితులు
• రోగులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రులు



చెన్నూర్ సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు

చెన్నూర్: వర్షాకాలం వచ్చిందంటే సీజనల్ వ్యాధులు విజృంభిస్తాయి. పది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాతావరణం చల్లబడడంతో జనాలు వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. చెన్నూర్, కోటపల్లి మండలాల్లో వైరల్ ఫీవర్లు ప్రబలుతున్నాయి. వైరల్ జ్వరాలు, జలుబు, దగ్గు సోకడంతో చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రం రోగులతో కిటకిటలాడుతోంది. గతంలో సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఔట్ పేషెంట్లు రోజుకు 150 నుంచి 200 వరకు వస్తుండగా ప్రస్తుతం ఆ సంఖ్య 300 నుంచి 350కు చేరింది.

అధికారులు అప్రమత్తం కావాలి..

చెన్నూర్ మున్సిపాలిటీతో పాటు మండలం, కోటపల్లి మండలాల్లో ఇప్పుడిప్పుడే ప్రారంభమైన వైరల్ ఫీవర్ల పట్ల అధికారులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది. వైరల్ ఫీవర్లను ఆదిలోనే అరికట్టలేదంటే రానున్న రోజుల్లో ఆస్పత్రుల్లో పడకలు సరిపోని పరిస్థితి నెలకొంటుందని వైద్యులు పేర్కొంటున్నారు.

క్లోరినేషన్ తప్పని సరి..

జిల్లాలో పది రోజులుగా కురుసున్న వర్షాలకు బావులు, బోర్లలో కొత్త నీరు వచ్చి చేరింది. కొత్త నీరు నేరుగా సేవిస్తే సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయి. గ్రామాలలో గల నీటి వనరులు బావులు, ట్యాంక్‌లు, బోర్లలో క్లోరినేషన్ చేయాల్సిన అవసరం ఉందని పలు గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.

దోమలు ప్రబలకుండా..

గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్లపై గుంతల్లో నీరు నిలిచి బురదమయంగా మారాయి. దీంతో దోమలు వృద్ధి చెందాయి. దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వ్యాధులను అరికట్టాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. ఇండ్ల ఆవరణలో నీరు నిలువకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి ఒక్కరూ వ్యక్తి గత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధులను నియంత్రించవచ్చు.

– డి.సత్యనారాయణ, సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్, చెన్నూర్

పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలు



బెల్లంపల్లి: బెల్లంపల్లి బజారు ఏరియా జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98లో పదోతరగతి పూర్తిచేసిన విద్యార్థులు ఆదివారం సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకున్నారు. కాల్‌టెక్స్ ఏరియాలోని వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో వేడుకలు నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత అంతా ఒకేచోట కలుసుకుని ఆత్మీయతను పంచుకున్నారు. చిన్ననాటి తీపి జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకుని ఉల్లాసంగా గడిపారు.



కాసిపేట: మండల కేంద్రంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 2009-10 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఒకేచోట కలుసుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సన్మానించారు. అప్పటి హెచ్‌ఎం ప్రదీప్‌రావు, ఉపాధ్యాయుడు గోంటి వెంకటేశ్వరరావు, ప్రస్తుత హెచ్‌ఎం వెంకటేశ్వరస్వామి, విద్యార్థులు నవీన్, అజయ్, దామోదర్, సాయిరాం, షారుఖ్‌ఖాన్, ప్రవీణ్, కావ్య, కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.